నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | సోమవారం 6 మే 2024 | ADILABAD NIRMAL

## మొక్కలు నాటిన వధూవరులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఇచ్చోడ, మే 5 : జోగినపల్లి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా నూతన వధూవరులు గాడ్గె ధీరజ్-వైష్ణవి మొక్కలు నాటారు. ఆదివారం మండలంలోని ముక్రా(కే) మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి-సుభాష్ కొడుకు గాడ్గె ధీరజ్ వివాహం వైష్ణవితో జరిగింది. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు హాజరై వధూ వరులను ఆశీర్వదించారు. వారితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాండురంగ్, లక్ష్మి, రమేశ్ పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న ట్రెయినీ పోలీసులు



సిరా గుర్తు చూపుతున్న టీఎస్పీఎస్ ట్రెయినీ పోలీసులు

బోథ్, మే 5 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన బెటాలియన్ కమాండెంట్ టీఎస్పీఎస్ ట్రెయినీ పోలీసులు బోథ్ నియోజక వర్గంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 39మంది బృందం గల సభ్యులు హైదరా బాద్‌లో శిక్షణ పొందుతున్నారు. వారి కమాండెంట్ అనుమతి ఇక్కడికి వచ్చి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# బీఆర్ఎస్‌లో జోష్



- అధినేత రోడ్‌షోతో మారిన రాజకీయ ముఖచిత్రం
- కేసీఆర్ ప్రసంగంతో ఫుల్ ఖుష్
- సింగరేణి కార్మికులు, అన్నదాతలు సహా అన్ని వర్గాలను ఆకట్టుకున్న గులాబీ దళపతి
- జిల్లాల రద్దు అంశంపై జోరుగా సాగుతున్న చర్చ
- జిల్లాలో ఒక్కసారిగా పెరిగిన గ్రాఫ్
- కొప్పుల గెలుపు ఖాయమంటూ ధీమా వ్యక్తం చేస్తున్న శ్రేణులు
- ప్రత్యర్థి పార్టీల్లో ఆందోళన



శనివారం నిర్వహించిన మంచిర్యాల రోడ్ షోకు తరలివచ్చిన అశేషజనవాహిని. మాట్లాడుతున్న గులాబీ దళపతి కేసీఆర్, ప్రజలకు అభివాదం చేస్తున్న పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/ మంచిర్యాల టౌన్, మే 5 : ''పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం పక్కా.. పెద్దపల్లిలో కొప్పుల ఈశ్వర్ గెలుస్తున్నడు. సర్వేలన్నీ ఇదే చెబుతున్నయ్''.. అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. పెద్దపల్లితో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని జిల్లాలు రద్దు చేస్తారంట కాంగ్రెసోళ్లు.. మరి జిల్లాలు ఉండాలి అనుకునేటోళ్లు బీఆర్ఎస్‌కు.. వద్దు అనుకునే వాళ్లు కాంగ్రెస్‌కు ఓటు వేయండం టూ ఇచ్చిన పిలుపు ఇప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. కేసీఆర్ ఒక్క రోడ్ షోతో ప్రజలను ఆలోచింప చేయడంతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థుల విజయవకాశాలను మెరుగుపరిచారంటూ రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా కేసీఆర్ రోడ్ షోకు హాజరైన జనం, ఆయన ప్రసంగం గురించే చర్చ నడుస్తున్నది. దీంతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో జోష్ పెరిగింది. ప్రచారంలో దూకుడు పెంచిన గులాబీ లీడర్లు కేసీఆర్ ప్రస్తావించిన అంశాలే ఆయుధంగా దూసుకెళ్లిపోతున్నారు. ఎక్కడికెళ్లినా మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలు ఉండాలంటే బీఆర్ఎస్ ఎంపీనే గెలిపించాలంటూ చెబుతున్నారు. మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జిల్లాల రద్దు అంశంతో పాటు కేసీఆరే కొప్పుల ఈశ్వర్ గెలుస్తున్నడని చెప్పిం డు.. ఆయనే గెలుస్తడేమో అనే పాజిటివ్ టాక్ నడుస్తున్నది. దీంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లాలో రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. నిన్న..మొన్నటి వరకు కార్యకర్తలు, నాయకుల్లో ఉన్న అపోహలన్నీ కేసీఆర్ టూర్‌తో పటాపంచలైపోయాయి. గులాబీ దళపతి ఇచ్చిన బలంతో పెద్దపల్లి, ఆదిలాబాద్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు ముందుకుసాగుతున్నాయి.

### కాంగ్రెస్‌పై వ్యతిరేకత.. బీఆర్ఎస్‌పై ప్రేమ..

ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. కేసీఆర్ తన ప్రసంగంలో ప్రభుత్వ పాలన వైఫల్యాలను ఎండగట్టడం, ఆరు గ్యారంటీలను ప్రశ్నించడంతో జనంలోకి చొచ్చుకుపోయారు. రెండు లక్షల రుణమాఫీ అయ్యిందా... వరికి రూ.500 బోనస్ వచ్చిందా.. కల్యాణలక్ష్మి తులం బంగారం వచ్చిందా.. మహిళలకు 2500 వచ్చాయా... అంటూ కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. సింగరేణి ప్రైవేటు పరం అంశాన్ని ప్రస్తావించి కార్మిక పక్షపాతిగా నిరూపించుకున్నారు. కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతను బీఆర్ఎస్‌పై ప్రేమగా మార్చడంలో కేసీఆర్ వందకు వందశాతం సక్సెక్ అయ్యారు. రైతులు, సింగరేణి కార్మికులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకున్నారు. కాంగ్రెస్‌కు ఓటేసి ఆగమైపోయినమనే డైలమాలో ఉన్న ప్రజానీకానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందనే భరోసాను కల్పించారు. ఇక బీజేపీతో తెలంగాణకు ఒరిగేది ఏముండదంటూ మరోసారి చెప్పకనే చెప్పారు. దీంతో ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు డైలమాలో పడిపోయారు. కేసీఆర్ ప్రస్తావించిన అంశాలకు ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో తెలియక తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కేసీఆర్ చేసిన దాడితో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లోకి ప్రత్యర్థి పార్టీలు వెళ్లిపోయాయి.

### జిల్లాలు రద్దు చేస్తే యుద్ధం..


కొత్త జిల్లాలను రద్దు చేస్తామని కాంగ్రెస్ అంటున్నది.. చావునోట్ల తలపెట్టి కొట్లాడి తెచ్చిన తెలంగాణ ఆగమైపోతే మౌనం వహించబోను.. జిల్లాలను రద్దు చేస్తే యుద్ధం చేద్దామన్న పిలుపుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల మనసును గెలుచుకున్నారు. ఎందుకంటే ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు మంచిర్యాల, ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్ పోవాలంటే నూరు.. నూటయాభై కిలోమీటర్లు పోవాల్సి వచ్చేది. ఇగ మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలైతే ఒక్క రోజు పోయి, మరుసటి రోజు పని చూసుకొని, మూడో రోజూ తిరిగి రావాల్సి వచ్చేది. కొత్త జిల్లాలతో ఆ బాధలు తప్పినయ్. ఇప్పుడు ఉన్నఫలంగా ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేస్తే మళ్లీ పాత కష్టాలు వస్తాయి. ఇప్పుడిప్పుడే తెల్లబడుతున్న గిరిజన తండాలు, గూడేలు మళ్లీ అంధకారంలోకి నెట్టబడుతాయి. కేసీఆర్ చెప్పిందే నిజం...గీ జిల్లాలు గిట్లనే ఉండాలనే భావన ప్రజల్లో పెరిగింది. ఏదో జరుగుతుందని మార్పు కోరుకుంటే ఇంత గోస పడాల్సి వస్తుందనుకోలేదంటూ చాలా మంది మాట్లాడుతున్నారు. ఇదే ట్రెండ్‌లో వెళ్తే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తిరుగు ఉండబోదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఒక్క బస్సు యాత్ర ఉమ్మడి జిల్లా రాజకీయాలనే మార్చేసిందని.. బీఆర్ఎస్ గ్రాఫ్ అమాంతం పెంచేసిందనే చర్చ నడుస్తున్నది. ఇదే ఉత్సాహం కొనసాగితే ఎన్నికల ఫలితాలను తిప్పేయడం ఖాయమనే విశ్లేషణలు మొదలయ్యాయి. మొత్తానికి ఒక్క కేసీఆర్ రోడ్‌షో ప్రత్యర్థి పార్టీలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదే జోష్ మరో వారం రోజులు నడిస్తే ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ అనుకూలంగా మారిపోయే పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నది.

## వైభవంగా సామూహిక వివాహాలు



వివాహనంతరం వేదిక వద్ద నిలుచున్న నూతన వధూవరులు

### నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు



వధూవరులకు కానుకలు అందజేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఇంద్రవెల్లి, మే 5 : దస్నాపూర్ గ్రామంలోని పూలాజీబాబా ధ్యాన కేంద్రం ఆవరణలో ఆంద్ ఆదివాసీ సమాజ్, దస్నాపూర్ ఆంద్ ఆదివాసీ సామూహిక వివాహ వేడుక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వివాహాలు జరిగాయి. ఈ వేడుకల్లో పదకొండు జంటలకు వివాహాలు చేశారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఎంపీపీ శోభాబాయి, జడ్పీటీసీ పుష్పలత, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్ పాల్గొని పూలాజీబాబా చిత్ర పటం వద్ద పూజలు చేశారు. అనంతరం నూతన వధూవరులకు ఆశీర్వదించి కానుకలను అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు దస్నాపూర్‌లో ఇంటింటా తిరుగుతూ నూతన వధూవరులకు వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో దస్నాపూర్ గ్రామ పటేల్ పుండలిక్‌పేల్, ఆంద్ ఆదివాసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కరాడే మారుతి, ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలు ఇంగ్లే వామన్‌రావ్, కేశవ్‌రావ్, డాకురే రాందాస్, గారుళే దశరథ్ పటేల్, జళ్కే పాండురంగ్, ముకాడే ఉత్తమ్, పోటే సాయినాథ్, జావదే కేశవ్ పాల్గొన్నారు.

### పాల్గొన్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే

సామూహిక వివాహ వేడుకల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. సాముహిక వివాహాలు నిర్వహిస్తున్న ఆంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలతోపాటు వివాహాల నిర్వహణ కమిటీ సభ్యులను మంత్రి సీతక్క అభినందించారు.

## అర్ధరాత్రి ఆగిన ట్రెయిన్



మార్గ మధ్యలో ఆగిన ట్రెయిన్

తాంసి, మే 5 : ఆదిలా బాద్ నుంచి తిరు పతికి బయలుదేరిన కృష్ణ ఎక్స్‌ప్రెస్ మార్గ మధ్యలో హఠా త్తుగా ఆగింది. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ నుంచి శని వారం రాత్రి 9గంటలకు బయలు దేరిన ఈ ట్రెయిన్ తలమడుగు మండలంలోని ఉండం వద్ద ట్రెయిన్ ఇంజిన్‌లో నెలకొన్న సమస్య కారణంగా 9.30 గంటలకు ఆగింది. దాదాపు 4 గంటలపాటు నిలిచింది. దీంతో చీకట్లోనే అర్ధరాత్రి వరకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైల్వే అధికారులు మరో ఇంజిన్ ఏర్పాటు చేయడంతో అర్ధరాత్రి 1.30 గంటకు ట్రెయిన్ కదిలింది.

### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

బాసర, మే 5 : బాసర సరస్వతీ అమ్మవారిని ఆదివారం ప్రముఖులు దర్శించుకున్నారు. సిద్దిపేట జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి రమాదేవి, భైంసా ప్రథమ శ్రేణి న్యాయస్థానం న్యాయమూర్తి దేవేందర్‌బాబు, తెలంగాణ రాష్ట్ర మల్టీ జోన్ – 1 ఐజీ ఏవీ రంగనాథ్‌లు, రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ మురళి బాబులు తమ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరికి అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితులు అమ్మవారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

## తెలంగాణ గళం బీఆర్ఎస్‌తోనే సాధ్యం



రోడ్ షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న



రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు

### మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, మే 5 : పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినబడాలంటే కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ మంత్రి జోగు రామన్న స్పష్టం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన భారీ రోడ్ షోకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామానికి వచ్చిన నేతలకు డప్పుచప్పుళ్ల మధ్య ప్రజలు స్వాగతం పలికారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల గుండా రోడ్ షో నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, లింగా రెడ్డి, రోకండ్ల రమేశ్, యాసం నర్సింగ్ రావ్, గణేశ్ యాదవ్, పెందుర్ దేవన్న, పురుషోత్తం యాదవ్, ప్రభాకర్, ఊశన్న, తదితరులు పాల్గొన్నారు.

## సక్కు గెలుపు ఖాయం..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- గాదిగూడ మండలంలో విస్తృత ప్రచారం



గాదిగూడలో ప్రచారం చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

నార్నూర్, మే 5 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పష్టం చేశారు. ఆదివారం గాదిగూడ మండలంలో పార్టీ శ్రేణులతో విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండలంలోని మారుమూల గ్రామా ల్లో పర్యటిస్తూ గడప గడపకూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆడ చంద్రకళ, వైస్ ఎంపీపీ యోగేశ్, నార్నూర్, గాదిగూడ మండలాధ్యక్షులు పుసంబాధిరావ్, మెస్రం హన్మంత్‌రావ్, నార్నూర్ వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, ఆత్రం వామన్, విష్ణుఫడ్, సయ్యద్ ఖాసీం పాల్గొన్నారు.

## బీజేపీ, కాంగ్రెస్‌లతో అభివృద్ధి శూన్యం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్ అర్బన్, మే 5 : బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని గాంధీ కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కూరగాయలు విక్రయించే వ్యాపారులతో మాట్లాడి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

## గోదావరి ప్రాంతం అపరిశుభ్రం

- పుష్కర ఘాట్‌పై చెత్తాచెదారం



పుష్కరఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

బాసర, మే 5 : బాసర గోదావరి ప్రాంతంలోని పుష్కరఘాట్ చెత్తమయం అయింది. ఎక్కడ చూసినా చెత్తతో అపరిశుభ్రంగా కనిపిస్తున్నది. గోదావరిలో నీటి సామర్థ్యం తగ్గడంతో ఘాట్‌లపై భక్తులు సమర్పించిన కనుములు, ఇతర పదార్థాలు పేరుకుపోయాయి. గోదావరి బ్రిడ్జి నుంచి ఘాట్లు మొత్తం అపరిశుభ్రంగా ఉన్నాయి. భక్తులు గోదావరిలో స్నానాలు చేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో స్వచ్ఛ భారత్ పేరిట ఆలయ సిబ్బంది వారానికి ఒకసారి శ్రమదానం చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కరువైంది.